సాక్షి
సిద్దిపేట
గురువారం । 14 । మార్చి । 2024



హత్యకేసులో నిందితుడి అరెస్టు


మహిళలను టార్గెట్ చేసి మాయ మాటలు చెప్పి నమ్మించి హత్యచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వివరాలు 8లో ▸



విద్యుత్ తీగే యమపాశం

పంటను రక్షించుకోవడం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ఓ మహిళ పాలిట యమ పాశమైంది. ఈ ఘటన శివ్వంపేట మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

గజ్వేల్ తహసీల్దార్ సస్పెన్షన్

గజ్వేల్: తహసీల్దార్ చల్లా శ్రీనివాస్ సస్పెన్షన్‌కు గురయ్యారు. కరీంనగర్ జిల్లాలో భూవివాదం కేసుకు సంబంధించి అరెస్టు కావడంతో ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఈయన స్థానంలో జగదేవ్‌పూర్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను నియమించారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలు కూడా వెలువడ్డాయి.

పలువురు ఆర్డీఓల బదిలీ

సిద్దిపేటరూరల్: జిల్లాలో పలువురు ఆర్డీఓలను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హుస్నాబాద్ ఆర్డీఓగా పనిచేస్తున్న పి.బెన్‌షాలెం యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీపై వెళ్లారు. ఏటూరు నాగారం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.రాంమూర్తి హుస్నాబాద్ ఆర్డీఓగా బదిలీపై వచ్చారు. సిద్దిపేట ఆర్డీఓగా పనిచేస్తున్న ఎస్.రమేశ్‌బాబు హుజూరాబాద్ ఆర్డీఓగా బదిలీ అయ్యారు. వరంగల్, హన్మకొండ భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ పీఏగా ఉన్న పి. సదానందం సిద్దిపేట ఆర్డీఓగా బదిలీపై వచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధుల్లో చేరనున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొమురవెల్లి మల్లన్న రాజగోపురం ఎదుట మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నెరవేర్చడంతో సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మంకాల నగేష్, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, యూత్ అధ్యక్షుడు రవి, మహిళ అధ్యక్షురాలు సరిత తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌తో చీడపీడల గుర్తింపు



పొలంలో మొబైల్ యాప్ ప్రదర్శన

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్ వినియోగంతో సకాలంలో చీడపీడలను గుర్తించవచ్చని జీడిమెట్ల కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారి సునీత అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాచాపూర్ రైతు వేదికలో సిద్దిపేట, మెదక్, సిరిసిల్లా జిల్లాకు చెందిన 30 మంది రైతులకు జాతీయ పురుగు, తెగులు నిఘా సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు వ్యాపించే కొత్త రకమైన పురుగుల నివారణకు జాతీయ స్థాయిలో సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం వల్ల రైతులకు మేలు చేకూరుతుందన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పంట పొలాలకు వెళ్లి చీడ పీడల ఫొటోలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మ, సహాయ సంరక్షణ అధికారులు నీలారాణి, శ్వేత, సుధా, ఏఓ జయంత్ కుమార్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారం అందిస్తున్న సంక్షేమాధికారి

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రి అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి పండ్లు, పోషకాహారం అందించారు. సంక్షేమాధికారి సావిత్రి మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా అంగన్‌వాడీల ద్వారా నాణ్యమైన పోషకారాన్ని అందిస్తున్నామన్నారు.

చిన్నప్పుడే అనుకున్నా.. కలెక్టర్ కావాలని



పట్టుదలతో సాధించి అమ్మ కలల్ని నిజం చేశా

'చిన్నప్పుడు చదువుతున్న రోజుల్లోనే కలెక్టర్ కావాలని గోల్. అమ్మ కల కూడా ఇదే.. బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సమయంలో సివిల్స్ సాధించేందుకు కష్టపడ్డాను. తొలి ప్రయత్నంలోనే సివిల్స్ 2017లో 36వ ర్యాంక్‌ను సాధించా. ప్రభుత్వం అమలు చేసే ప్రతీ పథకాన్ని అర్హులకు అందే విధంగా, జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నా' నని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. కుటుంబ నేపథ్యం, కెరీర్ అనుభవం, తదితర విషయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

– సాక్షి, సిద్దిపేట

టర్నింగ్ పాయింట్

- చిత్రారామచంద్రన్ స్ఫూర్తితోనే ముందుకు
- తొలి ప్రయత్నంలోనే సివిల్స్‌లో 36వ ర్యాంక్
- రోజుకు 18 గంటలు చదివా
- జీవితంలో ఉన్నతిపై కలెక్టర్ మనుచౌదరి మాటామంతి

మా అమ్మ పేరు భారతి. అమ్మ కలల్ని నిజం చేశా. నా చిన్నతనంలో కలెక్టర్ కావాలని చెప్పేవారు. రోజూ న్యూస్ పేపర్లను అమ్మ చదివేది. వాటిలో చూసి కలెక్టర్ కావాలని చెప్పేది. అమ్మ చదువుకునే సమయంలో అప్పుడు కలెక్టర్‌గా ఉన్న చిత్రారామచంద్రన్ పనితీరును చూసి ఐఏఎస్ అధికారి అయితే పేదలకు సేవలు అందించవచ్చని భావించారు. అలా అమ్మ, నాన్న నన్ను ప్రోత్సహించారు. దీంతో ఈ స్థాయికి రాగలిగాను. చిన్నప్పుడు స్కూల్‌లో నీ లక్ష్యం ఏంటి అడిగితే వెంటనే కలెక్టర్ నవుతా అనే చెప్పేవాడిని.

➡ చదువు పలు ప్రాంతాల్లో..

నాన్నగారు ఓరియెంట్ సిమెంట్ పరిశ్రమలలో సీనియర్ కెమిస్ట్‌గా పని చేసేవారు. ఉద్యోగ రీత్యా బదిలీలు అవుతుంటాయి. అందులో భాగంగా నా విద్యాభ్యాసం పలు ప్రాంతాల్లో సాగింది. నాలుగో తరగతి వరకు ఆదిలాబాద్‌లోని దేవాపూర్‌లో చదివాను. అక్కడి నుంచి నాన్నకు మహారాష్ట్ర జల్గావ్‌కు బదిలీ అయింది. ఐదో తరగతి నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ వరకు అక్కడే చదివాను. పదో తరగతి 2006–2007, టెన్త్ ప్లస్ టూ 2007–2009, ఇంజనీరింగ్ 2009–2013 చదివాను. తర్వాత 2013–2015వరకు ఢిల్లీలో పీజీడీఎం పూర్తి చేశా.

➡ తొలి ప్రయత్నంలోనే...

2015లో వాజీరామ్ అండ్ రవికుమార్ దగ్గర సివిల్స్ కోచింగ్ తీసుకున్నా. ఒక ఏడాది శిక్షణ తీసుకున్నా తర్వాత 2016లో సివిల్స్ రాశాను.. మొదటి ప్రయత్నంలోనే 36వ ర్యాంక్‌ను సాధించాను. ఐఏఎస్‌కు ఎంపికయ్యాను. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత మొదట ట్రెయినీ కలెక్టర్ (స్పెషల్ ఆఫీసర్)గా వరంగల్ రూరల్ జిల్లాలో (ఇప్పుడు వరంగల్ జిల్లా) పని చేశాను. తర్వాత నాగర్ కర్నూల్ జిల్లాలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) మూడున్నర సంవత్సరాలు, కామారెడ్డి జిల్లాలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఏడు నెలల పాటు చేశాను. తర్వాత సిద్దిపేటకు జిల్లా కలెక్టర్‌గా వచ్చాను.

➡ మాది ఖమ్మం..

మాది ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకు గ్రామం. నాన్నగారు రాజబాబు, అమ్మ భారతి గృహిణి. నాకు 2020లో రాధతో వివాహం జరిగింది. తాను ప్రస్తుతం మంగళగిరిలో డీఎం కార్డియాలజిస్టుగా ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరు పిల్లలు. కుమారుడు పేరు చైత్విక్, కూతురు పేరు తార. చదువుతోనే సమాజంలో గౌరవం లభిస్తుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహమే నా జీవితంలో టర్నింగ్ పాయింట్ అయిందని, ఈ స్థాయికి ఎదిగానని 'సాక్షి'తో ఇలా చెప్పుకొచ్చారు.

నాలుగు గంటలే నిద్ర..

అమ్మ ఇచ్చిన ప్రోత్సాహంతో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సమయంలో సివిల్స్ కొట్టాలని డిసైడ్ అయ్యాను. రోజూ 18 గంటలు చదివాను. అందులో ఐదు గంటలు క్లాస్‌లు, 13 గంటల పాటు చదువుకున్నాను. రోజులో కేవలం నాలుగు గంటలు మాత్రమే నిద్రపోయే వాడిని. ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు ఒకే సారి ప్రిపరేషన్ ప్రారంభించాను. మెయిన్స్ కోసం రైటింగ్ బాగా ప్రాక్టీస్ చేశా, సీనియర్లు, గత విజేతలు రాసిన నోట్స్ ఫాలో అయ్యాను. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే సమయంలో అక్కడ వాతావరణం, ఫుడ్‌తో ఇబ్బంది పడ్డాను. నా గోల్ రీచ్ అవడమే లక్ష్యంగా పెట్టుకుని ఎంతటి కష్టాన్నినైనా లెక్క చేయలేదు. ఫోన్‌ను విద్యాసంబంధ విషయాల కోసమే మాత్రమే వినియోగించాను. వాట్సప్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉన్నా. లక్ష్యం పై దృష్టి పెట్టి మొదటి ప్రయత్నంలోనే సాధించగలిగాను.

ఎంతో అవగాహన వచ్చింది

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో పాటు ఇంకా ఏ పథకమైనా అర్హులకు అందేవిధంగా కృషి చేస్తున్నా. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తాను. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తాను. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా విధులు నిర్వర్తించాను. ఎన్నికల నిర్వహణపై పూర్తి స్థాయిలో అవగాహన వచ్చింది. ప్రశాంత వాతవరణంలో ఎలాంటి తప్పిదాలు లేకుండా నిర్వహించాను.





ట్రెయినీ కలెక్టర్ హోదాలో ఉన్నప్పుడు వరంగల్ రూరల్ జిల్లాలో బాలికలకు హెల్త్ కిట్లను పంపిణీ చేస్తున్న మనుచౌదరి, ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తూ...



హుస్నాబాద్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం

త్వరలో మెడికల్ కళాశాల

- జిల్లెల్లగడ్డలో ఏర్పాటుకు చర్యలు
- తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు
- ప్రతి గ్రామంలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్
- వంద పడకల ఆస్పత్రి 250 పడకలుగా అభివృద్ధి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: పట్టణంలో త్వరలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలో రూ.18.50 కోట్ల వ్యయంతో నిర్మించే పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ మను చౌదరితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.98 లక్షల వ్యయంతో నిర్మించే కిచెన్ షెడ్లు, టాయిలెట్లు, ఓపెన్ జిమ్‌ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం జిల్లెల్లగడ్డలో 30 ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించారని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల గౌరవాన్ని పెంచేలా పని చేస్తానన్నారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా రెండు నెలలు ముందుగానే అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్యలు తీసుకున్నామని తెలిపారు. నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలోనే డిగ్రీ విద్యార్థులకు విద్యాబోధన జరిగేలా కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. బాలికల వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన హుస్నాబాద్ బస్ స్టేషన్‌ను రూ. 2 కోట్లతో సుందరంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో బాల వికాస సంస్థ, సీఎస్ఆర్ నిధులతో ప్రతి గ్రామంలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లను నిర్మిస్తామన్నారు. హుస్నాబాద్ పట్టణంలో ఉన్న వంద పడకల ప్రభుత్వం ఆస్పత్రిని 250 పడకలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని మంత్రి తెలిపారు.

మహిళలకు వడ్డీలేని రుణాలు..

మహిళలకు వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ మను చౌదరి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించి డేటా పూర్తి చేశామన్నారు. దరఖాస్తుల్లో తప్పు లున్నట్లయితే మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి ప్రభుత్వం రూ. 10 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇందులో రూ. 2 కోట్లు విద్యకు, రూ. కోటి తాగునీటికి, మిగతా నిధులను వివిధ అవసరాలకు ఖర్చు చేసే వెసులుబాటు కల్పించిందన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీ లకావత్ మానస, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భూ సేకరణ పూర్తి చేయండి



గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

- గౌరవెల్లి కెనాల్స్‌ను త్వరితగతిన చేపట్టాలి
- కలెక్టర్ మను చౌదరి

అక్కన్నపేట (హుస్నాబాద్): గౌరవెల్లి కుడి, ఎడమ కాలువల కోసం భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిధి గుడాటిపల్లి వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాజెక్టు డీఈలు ప్రశాంత్, కరణశ్రీలను ప్రాజెక్టు స్టేటస్, నిర్మించాల్సిన డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ వాటికి అవసరమైన భూ సేకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం దాదాపు పూర్తయినందున డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణం కావాల్సి ఉందన్నారు. కుడి, ఎడమ కాలువల భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ బెన్ శాలోమ్, తహశీల్దార్ ఇంజమూరి సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపండి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను కలెక్టర్ మను చౌదరి సందర్శించారు. పాలిటెక్నిక్‌లోని ల్యాబ్‌లు, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలేజీ ఆవరణలోని బండరాళ్లను తొలగించి, విద్యార్థులకు హాస్టల్స్ నిర్మించాలని, ఇందుకు ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆరుబయట ఉన్న బండరాళ్లను తొలగించడానికి మైనింగ్ వాళ్లకు చెప్పి బండరాళ్లను తీయిస్తామన్నారు. వీరి వెంట ఆర్డీవో బెన్‌షాలోం, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పుస్తక పఠనంతో పెంపొందనున్న మేధస్సు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శరీర దృఢత్వానికి ఆటలు, మేధస్సు పెంపొందించడానికి పుస్తకాలు దోహదపడతాయని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌శర్మ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. తాను ఇదే పాఠశాలలో చదవుతో పాటు క్రమశిక్షణ నేర్చుకున్నానని అన్నారు. ప్రణాళికతో క్రమశిక్షతో చదవి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలల్లో నిర్వహించిన క్రీడ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

చేర్యాల(సిద్దిపేట): పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయి కేపీఆర్ నగర్‌లో రూ.1.60 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయనున్నామన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- హాజరుకానున్న 13,987 మంది విద్యార్థులు
- ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌కు వేర్వేరు పరీక్షలు
- ఒక్క నిమిషం నిబంధన తప్పనిసరి
- డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2వరకు వార్షిక పరీక్షలు జరుగుతాయని ఇందుకు జిల్లాలో 80 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈఓ తెలిపారు. బుధవారం సిద్దిపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 371 పాఠశాలల నుంచి 13,987 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఒక్క నిమిషం నిబంధన అమలులో ఉందని, విద్యార్థులు 9గంటలలోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో హాల్ టికెట్లు చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

ఈసారి వేర్వేరుగా..

గతంలో ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ ఒకే రోజు పరీక్షలు జరిగేవని, ఈసారి మాత్రం వేర్వేరు రోజుల్లో జరుగుతాయని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతులు లేవన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 23 స్టోరేజ్ పాయింట్ల సంఖ్య, ఏడుగురు కస్టోడియన్, ఏడుగురు రూట్ ఆఫీసర్లు, 80మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 80 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 46 మంది స్టోరేజ్ పాయింట్ సంరక్షకులు,789మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఈసమావేశంలో ఎంఈఓ యాదవరెడ్డి, ఏసీజీఈ లక్ష్మయ్య పాల్గొన్నారు.

మెదక్‌కు రఘునందన్.. జహీరాబాద్‌కు అనిల్

- అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ, బీఆర్ఎస్
- మెదక్ లోక్‌సభ స్థానంపై వీడని సస్పెన్స్
- కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న జగ్గారెడ్డి సతీమణి నిర్మల, నీలం మధు
- బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రతాప్‌రెడ్డిని ప్రకటించే అవకాశం!



రఘునందన్ రావు

సాక్షి, సిద్దిపేట/జహీరాబాద్: బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి. బుధవారం బీజేపీ మెదక్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు, బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా గాలి అనిల్ కుమార్‌ను ప్రకటించాయి. పార్టీ అధినేత కె.చంద్రశేఖరరావు అధికారికంగా గాలి పేరును ప్రకటించారు. ఎంపీ టికెట్‌ను పలువురు ఆశించినప్పటికీ అధిష్టానం అనిల్‌కుమార్ వైపే మొగ్గుచూపింది. లోక్‌సభ పరిధిలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉండటమే కారణంగా పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. టికెట్‌ను ప్రకటించిన వెంటనే గాలి అనిల్‌కుమార్.. పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ తదితరులు కేసీఆర్‌ను కలిశారు. అయితే.. బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థిగా దుబ్బాక మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు కు అవకాశం కల్పించింది. ముందుగా ఊహించినట్లుగానే పార్టీ అధిష్టానం బుధవారం రాత్రి ప్రకటించిన 2 వ జాబితాలో ఆయన పేరును ఖరారు చేసింది. అధిష్టానం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపినట్లు రఘునందన్ సాక్షి కి తెలిపారు. అలాగే మెదక్ ఎంపీ స్థానానికి గాను బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి ఇంకా అభ్యర్థులను ప్రకటించకపోవడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్ నుంచి.. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డికి దాదాపు ఖరారు అయ్యే అవకాశం ఉంది. తొలుత ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి పేరు వినిపించినా పరిస్థితులకు అనుగుణంగా అభ్యర్థిని మార్చాలని నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సతీమణి నిర్మల, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నీలం మధు టికెట్ ఆశిస్తున్నారు. కాగా, గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్‌ను నిర్మల కలిసి తనకు టిక్కెట్ ఖరారు చేయాలని కోరినట్లు తెలుస్తోంది.



కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న గాలి అనిల్‌కుమార్

క్లుప్తంగా

బావిలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్


బావిలోంచి బయటకు తీస్తున్న ట్రాక్టర్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని బొడిగేపల్లి–గోవర్ధనగిరి గ్రామాల శివారులో ఓ ట్రాక్టర్ బావిలోకి దూసుకెళ్లింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. జనగామ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ట్రాక్టర్‌లో మొక్కజొన్న కంకుల లోడ్ వేసుకుని మంగళవారం రాత్రి గోవర్ధనగిరి గ్రామానికి వెళ్లాడు. తిరిగి ఇంటికొస్తుండగా అజాగ్రత్తగా నడపడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్‌తో పాటు మరొకరు ట్రాక్టర్ నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. దీంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. బుధవారం ఉదయం ట్రాక్టర్‌ను క్రేన్ సహాయంతో బయటకు తీశారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

నలుగురు అదుపులోకి..


పేకాడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరంలోని న్యూయార్క్ టైలర్ షాప్‌పై బుధవారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్, కోహెడ పోలీసులు దాడిచేసి పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,300, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేశామని, పేకాట, జూదం, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం వంటి సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

చెరువులో మృతదేహం లభ్యం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని వావిలాల గ్రామంలోని పీర్ల చెరువులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ విజయారావు మృతదేహాన్ని పరిశీలించి గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన వెంకటేశ్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు చోట్ల తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించగా 11మంది వాహనదారులు మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో బుధవారం హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి శ్రావణి వారికి రూ.5,400 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన వాహనదారులకు సీఐ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు.

వాహనం ఢీకొని మహిళ..

వర్గల్(గజ్వేల్): రోడ్డు పక్క నుంచి వెళ్తున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారిపై జరిగింది. గౌరారం ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్‌కు చెందిన నల్ల అండాలు(60) కొంత కాలం నుంచి సింగాయపల్లిలోని తన కూతురు బొద్దుల రమాదేవి వద్ద ఉంటుంది. గౌరారంలో ఓ హోటల్ లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంది. బుధవారం రాజీవ్ రహదారి గుండా హోటల్ కు నడుచుకుంటూ వెళ్తున్న ఆమెను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమార్తె రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుడే అనుకున్న ఐపీఎస్ కావాలని..



- స్కూల్‌కు వచ్చిన అధికారులను చూసి ఇన్‌స్పైర్ అయ్యాను
- వారే నా రోల్‌మోడల్.. ఆత్మవిశ్వాసంతో ముందడుగు
- ఉద్యోగం చేసుకుంటూ సివిల్స్‌కు సన్నద్ధం
- ఎస్పీ చెన్నూరి రూపేష్ కెరీర్ అనుభవాలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : "హసన్‌పర్తి జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న రోజులవి. ఇది గవర్నమెంట్ స్కూల్ కావడంతో తరచూ మా పాఠశాలకు కలెక్టర్లు, జేసీలు, ఎస్పీలు వచ్చేవారు. వారికి స్కూల్‌లో దక్కే గౌరవమే వేరుగా ఉండేది. అప్పుడే అనుకున్న.. నేను కూడా ఇలాంటి ఉన్నతాధికారిని కావాలని.. అప్పటి నుంచే ఓ ప్రణాళికాబద్ధంగా చదువుకుని అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నా. ఇదే నా జీవితంలో టర్నింగ్ పాయింట్. నేను ఐపీఎస్ అధికారి కావడానికి అదే కారణమైంది"అని అన్నారు సంగారెడ్డి ఎస్పీ, యువ ఐపీఎస్ అధికారి చెన్నూరు రూపేష్. 26 సంవత్సరాల్లోనే ఐపీఎస్ అధికారిగా నియమితులైన ఆయనకు పేదరికం ఎక్కడా అడ్డు కాలేదు. శ్రద్ధగా చదువుకున్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లారు.. ఒడిదొడుకులను ఎదుర్కొని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకున్నారు. ఈ యువ ఐపీఎస్ అధికారి తన బాల్య స్మృతులు, కుటుంబ నేపథ్యం.. కెరీర్ అనుభవాలు.. తదితర విషయాలను 'సాక్షి'ప్రతినిధితో పంచుకున్నారు.

ఆటోడ్రైవర్ కుమారుడు ఐపీఎస్ అయ్యాడు..

రూపేష్ తండ్రి రమణయ్య ఆటోడ్రైవర్. తల్లి సరోజన బీడీ కార్మికురాలు. ఆయనకు అన్న, అక్క ఉన్నారు. బాల్యమంతా తన సొంతూరు వరంగల్ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలోనే గడిచింది. విద్యాభ్యాసమంతా ఇక్కడే సాగింది. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారు. పేద కుటుంబం కావడంతో తొందరగా తన కాళ్ల మీద తాను నిలబడాలనే భావన ఉండేది. పదో తరగతి అయిన వెంటనే వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీలో జాయిన్ అయ్యారు. ఇది పూర్తి చేసిన వెంటనే వరంగల్‌లో ఉన్న కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ (ఈఈఈ)లో చేరారు. ఇంజినీరింగ్ పూర్తయిన వెంటనే సెంట్రల్ పబ్లిక్ వర్క్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ)లో జూనియర్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించారు.

ప్రేమ వివాహం..

రూపేష్‌ది ప్రేమ వివాహం. ఆయన సతీమణి లత అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో చదువుకున్నప్పుడు వీరి పరిచయం కాస్త ప్రేమగా మారింది. కులాంతర వివాహం కావడంతో చిన్న చిన్న ఇబ్బందులు ఎదురయ్యాయని, ఆ తర్వాత తమ ప్రేమను ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించారని తెలిపారు. వీరికి కుమారుడి రియాన్ష్ ఉన్నారు.

ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు సన్నద్ధం

సాధారణంగా సివిల్స్ సాధించాలంటే అభ్యర్థులు అన్నీ వదులుకుని ఏళ్ల తరబడి ఈ పరీక్ష కోసం సన్నద్ధమవుతుంటారు. ఢిల్లీ వంటి మహానగరాల్లో ఖరీదైన కేంద్రాల్లో కోచింగ్‌లు తీసుకుంటారు. సంవత్సరాల తరబడి పుస్తకాలతో కుస్తీలు పడుతుంటారు. గ్రూప్ డిస్కషన్స్.. ఇలా అన్ని కోణాల్లో సన్నద్ధమవుతుంటారు. కానీ రూపేష్ ఒకవైపు ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకున్నారు. జూనియర్ ఇంజినీర్‌గా జాబ్ చేస్తూనే.. ఉదయం., సాయంత్రం వేళల్లో ఈ సివిల్స్ పరీక్ష కోసం ప్రిపేర్ అయ్యేవారు. శని, ఆదివారాలు ఇలా సెలవు రోజులను సద్వినియోగం చేసుకున్నారు. ఉన్న సమయంలోనే కష్టపడి చదివేవారు. ఇలా సివిల్స్ పరీక్షను ప్రిపేర్ అయ్యారు. మూడు సార్లు ప్రయత్నించారు. కానీ అర్హత కాలేదు. పరీక్షల్లో చేసిన తప్పిదాలను సరిచేసుకొని నాలుగోసారి ప్రయత్నించారు. జాతీయ స్థాయిలోనే 526 ర్యాంకు సాధించారు. ఐఏఎస్ కావాలని అనుకున్నప్పటికీ ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ఉద్యోగం చేసుకుంటూ చెన్నైలో ఉన్నప్పుడు తనకు ఎంతో ఆత్మవిశ్వాసం వచ్చిందని.. ఈ క్రమంలోనే సివిల్స్ కోసం ప్రిపేర్ అయ్యానని 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రూపేష్ పేర్కొన్నారు. ఒక ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే సివిల్స్ వంటి పరీక్షల్లో విజయం సాధించవచ్చని చెబుతున్నారు.

స్వరాష్ట్రంలో పని చేయడం సంతృప్తినిస్తోంది..

"ఐపీఎస్ అధికారిగా ఎంపిక కావడం నా జీవితంలో ఎంతో సంతృప్తిని ఇచ్చింది. పైగా నా సొంత రాష్ట్రం తెలంగాణలో సేవలందించడం ఇంకా సంతృప్తినిచ్చింది.. పేదరికంతో ఇబ్బందులుంటాయి. కానీ ఉన్నత లక్ష్యాలను అధిగమించాలనే గట్టి సంకల్పం. కఠోర శ్రమ ఉంటే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమే. జీవితంలో కేరీర్ పరంగా గానీ, చదువుకుంటున్నప్పుడు గానీ అక్కడక్కడ చేదు అనుభవాలు ఎదురవుతుంటాయి. వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగాలి.." అని రూపేష్ పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ ప్రథమ కర్తవ్యమని, ఉద్యోగంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రాధాన్యతలు ఉంటాయని, సంగారెడ్డి పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఈ జిల్లాలో ఆయా రంగాలు సజావుగా సాగాలంటే పోలీసు శాఖ పరంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

కుల రక్కసి కసి పెంచింది..

ఈ స్థాయికి ఎదిగా..!

చదువుతోనే సమాజంలో గౌరవమని భావించా..

- కష్టపడి చదివి ఐపీఎస్ అయ్యా..
- నాడు చిన్నచూపు చూసిన వారే గెస్ట్‌గా పిలుస్తున్నారు
- 'సాక్షి'తో మెదక్ ఎస్పీ డాక్టర్ బాలస్వామి

టర్నింగ్ పాయింట్



చదువుకునే రోజుల్లోనే అంటరానితనాన్ని ఎదుర్కొన్నారు. అగ్రవర్ణాలకు చెందిన తోటి క్లాస్‌మేట్స్, వారి తల్లిదండ్రుల చిన్నచూపును భరించారు. కులరక్కసి విరుగుడుకు చదువే చక్కటి మార్గమని భావించారు. పట్టువదలని విక్రమార్కుడిలా చదివి ఐపీఎస్ సాధించారు. ఆయనే మెదక్ ఎస్పీ డాక్టర్ బాలస్వామి. ఒక నాడు కులవివక్షతో చూసిన వారే నేడు పలు కార్యక్రమాలకు గెస్ట్‌గా పిలుస్తున్నారని.. చదువుతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని అంటున్నారు. కుల వివక్షే తన జీవన ప్రయాణానికి టర్నింగ్ పాయింట్ అయిందని, ఈ స్థాయికి ఎదిగానని 'సాక్షి'తో ఇలా చెప్పుకొచ్చారు.

– మెదక్

కులవివక్షతో చదువుపై దృష్టి

విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగింది. 3వ తరగతి వరకు స్వగ్రామం తల్కపల్లి. 7వ తరగతి వరకు అనంతసాగర్, 8 నుంచి ఇంటర్ వరకు నాగర్‌కర్నూల్‌లో చదివా. డిగ్రీ ఓపెన్ యూనివర్సిటీ డిస్టెన్స్‌లో పూర్తి చేసి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ చేశా. గణితంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇంటర్ వరకు అంటరానితనాన్ని తీవ్రంగా ఎదుర్కొన్నా. అగ్రవర్ణాలకు చెందిన తోటి క్లాస్‌మేట్స్, వారి తల్లిదండ్రులు చిన్నచూపు చూసేవారు. దీనిని ఎదిరించేందుకు ఏకైకమార్గం చదువు ఒక్కటేనని గ్రహించి కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకున్నా.

మాది ప్రేమ వివాహం

నా జీవితంలో చేదు అనుభవాలు ఎక్కువే. మాది ప్రేమ వివాహం. నేను ప్రేమించిన అమ్మాయి టీచర్. మా కులాలు వేరు కావడంతో వారి ఇంట్లో పెళ్లికి ఒప్పుకోలేదు. నేను ఇంటర్ పూర్తికాగానే జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేశా. డిగ్రీ డిస్టెన్స్‌లో పూర్తి చేసి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ చేశా. ఉద్యోగం చేస్తూనే సివిల్స్ రాశా. ఐపీఎస్ కన్నా ముందు రెండుసార్లు ఐఆర్ఎస్ సాధించా. మూడేళ్ల పాటు ఉద్యోగం చేసి 2018లో ఐపీఎస్‌గా ఎంపికయ్యా. అయినప్పటికీ అమ్మాయి వాళ్ల ఇంట్లో పెళ్లికి ససేమిరా అన్నారు. 15 ఏళ్ల పాటు ఎన్నో ఇబ్బందులు పడి చివరకు ఐపీఎస్ శిక్షణ పూర్తికాగానే వివాహం చేసుకున్నాం. మాకు ఒక బాబు.

శిక్షణలో ఈత నేర్పించా

ఐపీఎస్ ట్రైనింగ్ కోసం ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్ వెళ్లాం. అక్కడ ఈత నేర్చుకోవాలి. కానీ అందులో నాకు తప్ప మిగితా వారికి ఎవరికీ ఈత రాదు. చిన్నప్పటి నుంచి గ్రామీణ ప్రాంతం కావడంతో ఐదేళ్ల నుంచే ఈత కొట్టడం వచ్చు. అర్బన్ ఏరియాకు చెందిన వారికి రాకపోవడంతో ఆ టీంకు ఆర్గనైజింగ్ స్క్వాడ్‌గా వ్యవహరించి ఈత నేర్పించా.

ఆ ముగ్గురే ఆదర్శం

అవమానాలు భరించి ఉన్నత చదువులు చదివిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ఐఏఎస్ టాప్ ర్యాంకర్ ముత్యాలరాజు నాకు ఆదర్శం.

అందరికీ ఒకే న్యాయం

సమస్యలతో నా దగ్గరకు వచ్చిన బాధితులకు ఐపీఎస్ ఆఫీసర్‌గా చట్ట ప్రకారం నా పరిధిలో సేవలందిస్తున్నా. పేదలు, ధనవంతులు అందరికీ ఒకే రకమైన చట్టాన్ని మన రాజ్యాంగం అందించింది. అది వంద శాతం అమలయ్యే విధంగా విధులు నిర్వర్తిస్తున్నా.

పెళ్లి చేసుకోనని మొహం చాటేయడంతో..

మనస్తాపంతో యువతి బలవన్మరణం

వర్గల్(గజ్వేల్): ప్రేమించిన యువకుడు పెళ్లి చేసుకోనంటూ మొహం చాటేయడంతో మనస్తాపంతో ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాధకర ఘటన వర్గల్ మండలం తున్కిఖాల్సాలో జరిగింది. గౌరారం ఎస్‌ఐ శివకుమార్ కథనం ప్రకారం.. వర్గల్ మండలం తున్కిఖాల్సాకు చెందిన యువతి(21) తుర్కపల్లిలోని ఓ పరిశ్రమలో రెండు సంవత్సరాల నుంచి ఉద్యోగం చేస్తోంది. ములుగు మండలం క్షీరసాగరకు చెందిన అభిషేక్ అనే యువకుడు ప్రేమిస్తున్నానంటూ రెండు సంవత్సరాలుగా ఆమెతో తిరిగాడు. పెళ్లి చేసుకోవాలని ఆమె కోరడంతో తమ ఇంట్లో ఒప్పుకోరంటూ తప్పించుకుని తిరుగుతున్నాడు. నెలరోజుల క్రితం ఇదే విషయం యువతి తన ఇంట్లో చెప్పుకుని బాధపడింది. యువతి కుటుంబ సభ్యులు యువకుడి కుటుంబ సభ్యులతో ప్రస్తావించగా వారు తిరస్కరించారు. దీంతో మనస్తాపానికి గురైన యువతి మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య

అంత్యక్రియల్లో పాల్గొని పాడెమోసిన మంత్రి పొన్నం


శ్రీజ(ఫైల్)

హుస్నాబాద్: కడుపు నొప్పి భరించలేక ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హుస్నాబాద్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత వడ్డెపల్లి వెంకటరమణ, వనిత దంపతుల కూతురు శ్రీజ(22). ఆమె హైదరాబాద్‌లో ఫార్మా డీ పూర్తిచేసింది. అయితే కొంత కాలంగా కడుపునొప్పి, అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో కడుపునొప్పి అధికం కావడంతో బుధవారం ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు. ఇదిలా ఉంటే.. శ్రీజ ఆత్మహత్య విషయం తెలియడంతో మంత్రి పొన్నం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వెంకటరమణను ఓదార్చారు. అంతిమయాత్రలో పాల్గొని పాడెమోశారు.


అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి పొన్నం

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు

- కూలీపనిచేసే మహిళలే టార్గెట్
- కేసును చేధించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీఐ సుధీర్‌కుమార్

జిన్నారం(పటాన్‌చెరు): కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మహిళలను టార్గెట్ చేసి మాయ మాటలు చెప్పి నమ్మించి హత్యచేసి బంగారు, వెండి ఆభరణాలను అపహరించే ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ బుధవారం ఆ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన కేతవాత్ గోపాల్ అక్కడే కూలీపని చేస్తున్న ముడావత్ మంగమ్మ(40)తో పరిచయం పెంచుకున్నాడు. శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కుల పంచాయతీ పరిధిలోని దేవమ్మగూడెం తండాకు చెందిన సోనీతో గోపాల్‌కు పరిచయం ఉంది. వారిద్దరు ఎలాగైనా డబ్బులు సంపాదించాలని అనుకున్నారు. ఈ క్రమంలో మంగమ్మను నీవు ఉంటున్న తండాకు తీసుకువస్తానని, ఆమెను చంపి బంగారు, వెండి ఆభరాలను అపహరిద్దామని గోపాల్, సోనీ పథకం పన్నారు. గత ఏడాది అక్టోబర్ 28న నల్లవల్లి అటవీ ప్రాంతంలో బంగారం ఉందని, దానిని అమ్ముకుందామని మంగమ్మను నమ్మించి గోపాల్ అటవీ ప్రాంతానికి తీసుకువచ్చాడు. అనుకున్న పథకం ప్రకారం సోనీ కూడా అక్కడే ఉంది. నల్లవల్లి అటవీ ప్రాంతంలో మంగమ్మ, గోపాల్ నడుకుంటూ వెళ్తుండగా సోనీ మంగమ్మపై దాడి చేసింది. గోపాల్ ఇద్దరూ కలిసి మంగమ్మను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించి వెళ్లిపోయారు. గోపాల్‌పై ఐదు హత్య కేసులు, రెండు చోరీ కేసులు ఉండగా, కొడంగల్‌లో జరిగిన ఓ హత్య కేసులో పదేళ్ల జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చాడు. ప్రసుతం సోనీ పారారీలో ఉండగా.. గోపాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. కేసును చేధించిన ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డితో పాటు సిబ్బందిని సీఐ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ తదితరులు

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం/భిక్కనూరు: కుటుంబ కలహాల వల్ల ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భిక్కనూరు – అక్కన్నపేట రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మెదక్ జిల్లా రామాయంపేట మండలం తోనిగండ్ల గ్రామానికి చెందిన పుర్ర ప్రవీణ్(26) లిఫ్ట్ మెకానిక్‌గా పనిచేసేవాడు. కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురైన ప్రవీణ్ మంగళవారం రాత్రి గుర్తు తెలియని రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులను విచారించగా, కుటుంబ కలహాలు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తావునాయక్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


మృత దేహం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారి పక్కన గుర్తు తెలియని మృత దేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మండల పరిధిలోని మేదినీపూర్ గ్రామ శివారులో బుధవారం ఉదయం మృత దేహం గురించి సమాచారం అందిందని, వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించామని చెప్పారు. 40, 45 ఏళ్ల వయస్సు ఉండి. మంగళవారం రాత్రి మృతి చెందినట్లుగా ప్రాథమికంగా గుర్తించామన్నారు. మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. సమాచారం కోసం 87126 67345 నంబరుకు ఫోన్ చేయాలని ఎస్‌ఐ శ్రీనివాస్ కోరారు.

విద్యుత్ తీగే యమపాశం


చింతపండు కోసం వెళ్లి మహిళ మృతి


మృతురాలు(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): పంటను రక్షించుకోవడం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ఓ మహిళ పాలిట యమపాశమైంది. ఈ విషాధం మండల పరిధి గూడూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొత్తపేట సరోజిని(65) గ్రామ శివారులోని చింత చెట్టు వద్ద చింత పండు సేకరిస్తోంది. ఈ క్రమంలో కోతుల బెడద కోసం పంటను కాపాడుకోవడానికి అదే గ్రామానికి చెందిన ఓ రైతు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ఆమెకు తగిలింది. షాక్ తగిలిన సరోజిని అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. విద్యుత్ తీగ ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పక్కనే కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహం కూడా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.


సరోజ మృతదేహం.. పక్కనే సేకరించిన చింతపండు

లారీ బోల్తాపడి డ్రైవర్ మృతి


రమాకర్‌యాదవ్ మృతదేహం

దుబ్బాకరూరల్: లారీ బోల్తాపడి రోడ్డు పక్కన కాలువలో పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మాపూర్ వద్ద బుధవారం జరిగింది. ఎస్‌ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర ప్రదేశ్‌లోని ఆజుంఘర్ జిల్లా నానుష మండలానికి చెందిన రమాకర్‌యాదవ్(32) క్యారియర్స్ కంపెనీకి చెందిన లారీడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శంకరంపేట గ్రామంలోని కంపెనీలోని స్టీల్ బార్స్‌ను లోడ్‌చేసుకుని వరంగల్‌కు తీసుకెళుతున్నాడు. రామాయంపేట వైపు నుంచి సిద్దిపేట వైపు వెళుతుండగా మార్గమధ్యలోని తిమ్మాపూర్ గ్రామం వద్ద లారీ అదుపు తప్పి రోడ్డు ప్రక్కన నిర్మాణంలో ఉన్న కాలువలో పడింది. క్యాబిన్‌లో ఉన్న స్టీల్ రాడ్స్ డ్రైవర్‌కు వెనుక నుంచి దిగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. క్యారియర్స్ నిర్వాహకుడు ఎండీ సాహెబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృత దేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలుడిపై దాడిచేసిన వ్యక్తిపై కేసు

బైక్‌ను దహనం చేశాడని అనుమానం..

కౌడిపల్లి(నర్సాపూర్): తన బైక్‌ను దహనం చేశాడన్న అనుమానంతో బాలుడిపై దాడిచేసి గాయపరిచిన యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి బుధవారం తెలిపారు. నర్సాపూర్ మండలం రాజిపేటకు చెందిన మహ్మద్ ఖాజపాషాకు చికెన్ దుకాణం ఉంది. అతని వద్ద ఓ బాలుడు పని చేస్తున్నాడు. అయితే మంగళవారం దుకాణం ఎదుట ఉన్న తన బైక్‌ను బాలుడు దహనం చేశాడన్న అనుమానంతో ఖాజపాష దాడిచేసి గాయపర్చాడు. దెబ్బలకు తట్టుకోలేని బాలుడు పక్కదుకాణంలో పనిచేసే అతని స్నేహితుడు పోచయ్య పేరు చెప్పడంతో అతనిపై కూడా ఖాజపాష దాడిచేశాడు. పక్క దుకాణదారుడు నసీర్ ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్నేహితుడిని కలిసేందుకు వెళుతూ..

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి


సాగర్ (ఫైల్)

దుబ్బాకటౌన్: స్నేహితుడిని కలిసేందుకు వెళుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో పడడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన దుబ్బాక మండలం బల్వంతాపూర్ శివారులో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు తెలిపిన సమాచారం మేరకు.. దుబ్బాకకు చెందిన అంబేడ్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు ఆస చిన్న ముత్యం ఏకైక కుమారుడు సాగర్(22) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు రోజుల క్రితమే హైదరాబాద్ నుంచి సాగర్ ఇంటికి వచ్చాడు. సిద్దిపేట మండలం మాచాపూర్‌లో తన స్నేహితుడిని కలిసేందుకు మంగళవారం రాత్రి తన తండ్రి బైక్ తీసుకొని జీడీ దినేశ్ అనే మరో స్నేహితుడితో కలిసి వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి బల్వంతాపూర్ ఒడ్డెర కాలనీ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు ప్రక్కనే ఉన్న గుంతలో పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దినేశ్‌కు గాయాలయ్యాయి. సాగర్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గంగరాజు తెలిపారు.